# భాగ్యవంతురాలు

**ఆరోజు గంగరాజు ఎక్కడికి వెళ్ళినా చుక్కెదురయింది.**

రైల్వేకాలనీలో ఓ యింటి తలుపు తట్టాడు. గీజరు బాగుచేసే మెకానిక్‌ని పంపుతానని ఇంటాయన చెప్పటం విని అందుకు సిద్ధమయ్యాడు. ఇంట్లో ఒక్కరు కాదు ముగ్గురున్నారు. పెరటి తలుపు, వీధి తలుపు తీసుకొని కూర్చున్నారు. గీజరు చూసినట్టే చూసి ఏదో పార్టు కావాలని చెప్పి బయట పడ్డాడు.

ఎక్సయిజు కాలనీలో తిరిగాడు. ఓ యింట్లో ఒక ముసలావిడ ఒక్కత్తే ఉన్నట్టు కనిపించింది. తీరా తను అక్కడికి వెళ్ళేసరికి తలుపు వేసేసుకుంది. వెళ్ళి తలుపు తట్టాడు. ఆవిడ కిటికీలోంచి చూసి 'ఇంట్లో ఎవరూ లేరు' అంటూ అయిపు లేకుండా పోయింది. అపరిచితులు వస్తే ఏం చేయాలో వాళ్ళ వాళ్ళు చెప్పివెళ్ళారని ఆమె చెప్పకనే చెప్పింది.

మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ రోడ్డునపడ్డాడు. బ్యాంకు కాలనీలో ఓ యిల్లాలు ఒంటరిగా వెడుతూ కనిపించింది. ఆమెను చాకుతో బెదిరించి ఏదైనా నగలాక్కోవచ్చు. కానీ రోడ్డు మీద అక్కడక్కడా జనం. ఆమె అరిస్తే? రభస అవుతుందేమో! ఇంట్లో తల్లి, చెల్లెలు..ఈ పూట తనేమయినా తెస్తాడని ఆశతో చూస్తూండి వుంటారు. కడుపులో ఆకలి మెలి తిరుగుతోంది. సమయం మించిపోతోంది. దొరికిన ఎరని వదులుకోకూడదు. ఆమె నుంచి ఏదోటి తీసుకుపోవాలి.

ఒక నిశ్చయానికి వచ్చి వడివడిగా అడుగులు వేస్తూ ఆమెకు దగ్గరయ్యాడు. కొంచెం గుబురు చెట్లు రాగా చూసి ఆమె ముందుకి దూసుకువచ్చి చాకు చూపించాడు. "నీ మెళ్ళో నగలు తియ్!"

అతనాశించినట్లు ఆమె భయపడలేదు. కేకలు పెట్టలేదు. నిశ్చలంగా నిలబడిపోయింది. బెదరదు. పలకదు. అతనివైపే తదేకంగా చూడసాగింది.

అతను క్షణంపాటు తెల్లబోయాడు. అంతలోనే అతన్ని తొందరపడేలా చేసింది అవసరం.

"ఏమిటలా చూస్తావ్? నగలు తీయమంటే నీక్కాదూ?" అని గదిమాడు.

"నా దగ్గర నగలేం లేవు" ఆమె గొంతులో తొణకని మార్దవం.

"ఆ మంగళసూత్రం ఉందిగా!" అని చాకుకొనతో బయటికి లాగబోయాడతను.

కానీ తనే చటుక్కున మెళ్ళోని తాడుని బయటికి లాగింది ఆమె.

నిర్ఘాంతపోయాడు గంగరాజు. అవి పసుపుకొమ్ములు.

"బ్యాంకు కాలనీలో అందరూ డబ్బున్న వాళ్ళేనను కుంటున్నావా తమ్ముడూ!" ఆమె పల్చని నవ్వులో నిర్వేదం.



గంగరాజుకి నోటమాట రాలేదు. చాకుని పట్టుకున్న చేయి వణికింది.

"అదే మా యిల్లు. కాసిన్ని మంచి నీళ్ళు తాగి వెళుదువుగాని. రా తమ్ముడూ!"

చాకు చూపించిన వాడిని మంచినీళ్ళు తాగ రమ్మంటున్న అమృతమూర్తి! అతని ముఖం వివర్ణమైంది.

"పాపం, ఎంత అవసరంలో ఉన్నావో ఏమో నాతేరా.."

అతనికిక మాట్లాడే శక్తి కరువైంది. మంత్రముగ్ధుడిలా ఆమె వెంట నడిచాడు. తానేం చేయాబోయాడో ఆమె ఎవరికేనా చెప్పి తనను తన్నించబోయినా అందుకు సిద్ధపడిన వాడిలా ఆమె వెంట నడిచాడు.

తాళం తీసి ఆమె లోపలికి అడుగుపెడుతూ అతనికి దారిచ్చింది. అదెవరో ఆఫీసరుగారి కాంపౌండులోని ఔట్‌హౌస్. వారి దయతో దొరికిన ఒకే గది గల చిన్న యిల్లది. కుర్చీ పీట వేసింది. మంచినీళ్ళు తెచ్చిచ్చింది. అప్పుడే తెచ్చిన సామానులోంచి ఓ పొట్లం విప్పి కాసిని అటుకులు బెల్లం కలిపి ఓ ప్లేట్లో పెట్టి అతని ముందు పెట్టింది. "తిను ఎంత ఆకలిమీదున్నావో పాపం!" ఆమె గొంతు నిండా వాత్సల్యం.

అతనికి అపరాధ భారం గుండెల్ని నొక్కేస్తోంది. ఎలాంటి మనిషిని తను దోచుకోబోయాడు! కనుకొలనుల్లోకి నీళ్ళు ఊరుతున్నాయి. "వద్దు" గొంతులో జీర.

"చూడు తమ్ముడూ! కష్టాలు కలకాలం ఉండవు. నిన్న మొన్నటిదాకా బ్రతుకంతా బాధలే అనుకునేదాన్ని. మా ఆయనకి ఫ్యాక్టరీలో ఆక్సిడెంటయి మూన్నెళ్లు మంచం మీదున్నాడు. జీతం లేదు. బడికి వెళ్ళే పిల్లాడు. ముగ్గురం బతకాలి. ఈ అయ్యగారింట్లో పని చేస్తే రెండొందలిస్తారు. అక్కడక్కడా పని చేయాలి. ఆయనకి మందులకోసం అప్పులు చేయాల్సి వచ్చింది. బతుకు చాలా కష్టమనిపించింది. ఇప్పుడాయనకి నయమైంది. ఇవేళ పనిలోకెళ్ళాడు. జీతం వచ్చేదాకా ఖర్చులు ఆగవు. ఇంట్లో సరుకులు లేవు. పిల్లాడికి పుస్తకాలు కావాలి. ఓ అరగంట క్రితం నువ్వెదురయివుంటే ఏమయ్యేదో నే చెప్పలేను. ఇప్పుడే మంగళసూత్రం తాకట్టుపెట్టి ఇంట్లోకి సరుకులు తెచ్చా. ఇదిగో ఇంక అరవై మిగిలాయి" అంటూ గంగరాజు ముందు పెట్టింది ఆమె.

"వద్దు. వద్దు. నాకేం వద్దు" అని చేతులతో ముఖం కప్పుకొని ఏడవసాగాడతను.

అతన్నలా కాసేపు ఏడవనిచ్చింది ఆమె. "ఇప్పుడు నాకర్థమైంది. ఇది నీ వృత్తి కాదు. జీవితంలో మొదటిసారి దోపిడీకి బయల్దేరావు కదూ!"

చేత్తో కళ్ళు తుడుచుకుంటూ తలవూపాడు.

"ఎక్కడేనా నువ్వు పట్టుపడిపోతే ఎంత అనర్థం జరిగివుండేది. నువ్వెవరి సుఖం కోసం ఇంత అఘాయిత్యానికి దిగావో వాళ్ళేమయిపోయేవారు? ఈ సంగతి ఎప్పుడేనా ఆలోచించావా?"

తెల్లబోతూ చూడసాగాడతను.

"జరిగిందేదో జరిగిపోయింది. ఓపిగ్గా పనికోసం వెతుకు. ఏదోటి దొరక్కపోదు. నీ కష్టార్జితంతో మీవాళ్ళకి తిండి పెట్టినప్పుడే అది సుఖం. అన్యాయంగా సంపాదించినప్పుడు కాదు. ఇంద..ఉంచు" అంటూ కొన్ని నోట్లు అతని చేతుల్లో కూరింది.

"వద్దమ్మా! వద్దు" అతని గొంతులో పశ్చాత్తాపం.

"అప్పుగానే తీసుకో!" ఆమె చిరునవ్వులో కారుణ్యం.

ఎంత దరిద్రంలో వున్నా ఔదార్యంలో ఆమె భాగ్యవంతురాలు. ఓ నేరస్తుడు కాకుండా తనను కాపాడిన ఆ దయామయి కాళ్ళకి మొక్కకుండా ఉండలేక పోయాడతను!

**-తటవర్తి రామచంద్రరావు**

(న్యూఢిల్లీ)